క్లుప్తంగా

విజయోత్సవ ర్యాలీలు నిషేధం

పరకాల : పార్లమెంట్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మంగళవారం విజయోత్సవ సంబురాలు, పాదయాత్రలు, ర్యాలీలు నిర్వహించొద్దని సీఐ రవిరాజ్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. డీజే, డప్పుచప్పుళ్లు, బైక్, కారు ర్యాలీలు, టపాసులు కాల్చడానికి అనుమతులు లేవని పేర్కొన్నారు. 144 సెక్షన్ అమలులో ఉన్నందున ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నడికూడ : మండలంలోని కంఠాత్మకూరులో గల గుడిస్థలాన్ని కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు సోమవారం రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే ఇటీవల ఆర్ఐ హేమనాయక్, సర్వేయర్ సర్వే చేసి 7 గుంటల భూమిని గుడిస్థలానికి కేటాయించారు. కానీ గ్రామస్తులు మాత్రం ఒప్పుకోలేదు. కంఠాత్మకూరుకు చెందిన పింగిలి ప్రతాపరెడ్డి 14 గుంటల భూమిని దానం చేశారని, ప్రస్తుతం రెండు గుంటల కూడా లేదని ఆరోపించారు. పోచమ్మగుడికి ఆనుకుని ఉన్నవారు కబ్జా చేశారని ఆరోపించారు. కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై ఆర్ఐ హేమనాయక్‌ను వివరణ కోరగా.. పోచమ్మగుడికి పింగిలి ప్రతాపరెడ్డి 14 గుంటల భూమిని దానం చేసినట్లు పత్రాలను గ్రామస్తులు చూపించలేదని తెలిపారు. ఎవరిపైనైతే గ్రామస్తులు ఆరోపిస్తున్నారో వారికి పట్టా ఉందని, సరియైన పత్రాలు చూపిస్తే విచారణ చేపట్టి గుడిస్థలాన్ని కేటాయిస్తామని తెలిపారు.

గీతకార్మికుడికి గాయాలు

ఐనవోలు : తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని కక్కిరాలపల్లిలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గీతకార్మికుడు చిర్ర రాజు వృత్తిలో భాగంగా సోమవారం ఉదయం కల్లు తీసేందుకు తాటిచెట్టు ఎక్కుతున్న క్రమంలో మోకు జారి చెట్టుపై నుంచి కిందపడ్డాడు. దీంతో అతడికి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించగా వారు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు. ప్రభుత్వం తక్షణమే ఎక్స్‌గ్రేషియా అందించి ఆదుకోవాలని బాధిత కుటుంబ సభ్యులు కోరారు.

నివాళి

ఖానాపురం : మండల కేంద్రానికి చెందిన కొలిశెట్టి హరిప్రసాద్ (37) అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రాత్రి మృతి చెందగా ఆయన మృతదేహానికి గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు మంగళవారం నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని సుబ్బారావు పరామర్శించారు.

పిల్లల విద్యాభ్యాసానికి చేయూత

హరిప్రసాద్ పిల్లలిద్దరికీ పదో తరగతి వరకు ఉచితంగా విద్యాబోధన అందిస్తామని గీతాంజలి విద్యాసంస్థల చైర్మన్ వేములపల్లి సుబ్బారావు హామీ ఇచ్చారు. హరిప్రసాద్ మృతి చెందగా సుబ్బారావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హరిప్రసాద్ తన స్కూల్‌లోనే విద్యార్థిగా చదువుకున్నాడని గుర్తు చేసుకున్నారు. చిన్న వయస్సులోనే మృతి చెందడం బాధాకరమన్నారు. హరిప్రసాద్ కూతురు వైష్ణవి 6వ, కుమారుడు వర్షిత్ 3వ తరగతి గీతాంజలి స్కూల్‌లోనే చదువుతుండగా ఇక నుంచి వారికి ఉచితంగా పదోతరగతి వరకు విద్యాబోధన అందిస్తామని చెప్పారు.

గిరిజన విజ్ఞాన పీఠం అభివృద్ధికి సహకరిస్తాం

హన్మకొండ కల్చరల్ : జానపద గిరిజన విజ్ఞానపీఠంలో విద్యార్థులకు ఉన్నత విద్య అందించడానికి వివిధ కోర్సులు ప్రవేశపెట్టాలని అందుకు ప్రభుత్వంతో చర్చిస్తామని, పీఠం అభివృద్ధికి సహకరిస్తామని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకుడు అంగోత్ వినోద్‌లోక్ నాయక్ అన్నారు. సోమవారం వరంగల్ తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠాన్ని యువజన రాష్ట్ర కాంగ్రెస్, విద్యార్థి నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి ప్రొఫెసర్ భూక్య బాబురావును నాయకులు శాలువాతో సన్మానించారు. అనంతరం బాబురావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధనలో విద్యార్థుల పాత్ర మరువరానిదన్నారు. విద్యార్థులు ఉన్నత విద్య అభ్యసించడానికి తగిన ఏర్పాట్లు చేస్తానని అన్నారు. కార్యక్రమంలో నాయకులు భూక్య రమేష్‌నాయక్, డాక్టర్ ఎం.వెంకట్‌నాయక్, ఎల్.కరుణాకర్‌నాయక్, తేజావత్ నాగరాజ్, బి.తిరుపతి నాయక్ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లల పేర్ల నమోదు

హసన్‌పర్తి : బడి ఈడు పిల్లల పేర్ల నమోదు కార్యక్రమానికి మండలంలోని వంగపహాడ్‌లో శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు ఇంటింటా తిరుగుతూ నమోదు కార్యక్రమం చేపట్టారు. ప్రస్తుతం పిల్లలు బడికి వెళ్తున్నారా? ఇంటి వద్దనే ఉంటున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లే పిల్లల వివరాలు సేకరించారు. వారిని సర్కార్ పాఠశాలలకు పంపించాలని పిల్లల తల్లిదండ్రులకు సూచించారు.

నకిలీపై నజర్..

- ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేస్తున్న అధికారులు
- విత్తనాల కొనుగోళ్లలో జాగ్రత్తలు పాటించాలని సూచన
- ఖరీఫ్‌కు సిద్ధమవుతున్న రైతన్నలు

ఐనవోలు: ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్న నేపథ్యంలో రైతులు విత్తనాలు కొనుగోలు చేసేందుకు సన్నద్ధం అవుతున్నారు. వేసవిలో యాసంగి పంటను తొలగించి చెరువు మట్టి, పశువుల పేడను తరలించి పొలాలు, చేన్లను చదును చేసి దుక్కులు దున్నుకుంటున్నారు. సరియైన సమయంలో విత్తనం విత్తాలని భావిస్తున్నారు.

రైతులకు అవగాహన..

మరోవైపు ఇదే అదనుగా భావిస్తున్న కొందరు వ్యాపారస్తులు నకిలీ విత్తనాలు మార్కెట్‌లోకి దించేందుకు అవకాశాలు ఉండగా అధికారులు సైతం అలర్ట్ అయ్యారు. దిక్కుమొక్కు లేని ప్రయివేట్ కంపెనీల విత్తనాలను కొనుగోలు చేయొద్దని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పోలీసులు, వ్యవసాయ అధికారులు విత్తన దుకాణాలలో సోదాలు నిర్వహించి నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరిస్తున్నారు. నకిలీ విత్తనాలతో పాటు కేంద్రం నిషేధించిన బీటీ–3 విత్తనాలను కొనుగోలు చేయవద్దని, లైసెన్సు కలిగిన దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచిస్తున్నారు. మండలంలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు ఎక్కువగా సాగు అవుతాయి.


పత్తి విత్తనాలను కొనుగోలు చేస్తున్న రైతులు


రిజిస్టర్ తనిఖీ చేస్తున్న ఏఓ కవిత (ఫైల్)


అవగాహన కల్పిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రైతులు పాటించాల్సిన సూచనలు

- ముందస్తుగా విత్తనాలు మొలకెత్తే శాతాన్ని ప్యాకెట్‌పై చూసుకోవాలి
- పంటను విత్తిన తర్వాత తప్పని సరిగా విత్తన ప్యాకెట్లను, రసీదులను భద్రపరుచుకోవాలి.
- ధ్రువీకరించిన సంస్థ పేరు, చిరునామా స్పష్టంగా ఉందో లేదో చూసుకోవాలి.
- సరిగా సీల్ వేసి, ధ్రువీకరణ పత్రం ఉన్న బస్తాల్లోని విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలి
- విత్తన రకం, పేరు, జన్యు స్వచ్ఛతకు సంబంధించిన వివరాలు, లాట్ నంబర్, విత్తనానికి సంబంధించిన ఇతర చిహ్నాలు ఉన్నాయో లేవో చూసుకోవాలి.
- విత్తనం ఎంతకాలం వరకు ఉపయోగించుకోవచ్చో తెలిపే సమాచారాన్ని పరిశీలించాలి.
- విత్తన ఉత్పత్తి దారుడిపై నమ్మకం ఉంటేనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- కొనుగోలు చేసిన విత్తనాలకు రసీదు తీసుకోవాలి.
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ ధ్రువీకరించిన నీలి వర్ణం ట్యాగు బస్తాపై ఉందో లేదో గమనించాలి.
- హైబ్రీడ్ విత్తనం కొనుగోలు చేసేటప్పుడు సంచిపైనున్న పసుపు రంగు ట్యాగు, భౌతిక స్వచ్ఛత, మొలకెత్తే శాతం, జన్యు నాణ్యత వంటి వివరాలు పరిశీలించాలి.
- వ్యవసాయశాఖ అధికారుల సూచనలు పాటించాలి.

జాగ్రత్తలు తప్పనిసరి

రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలి. అనామకులు చెప్పిన విత్తనాలు కొనుగోలు చేయొద్దు. లైసెన్స్ కలిగిన డీలర్ల వద్దనే కొనుగోలు చేసి తప్పకుండా రసీదు తీసుకోవాలి. అందులో విత్తన కంపెనీ పేరు, విత్తన రకం, బ్యాచ్‌నంబర్, లాట్ నంబర్, రేటు ఉండేలా చూసుకోవాలి. ఎంఆర్‌పీ కంటే ఎక్కువగా విక్రయిస్తే నేరుగా వ్యవసాయశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. ఇతర జిల్లా, రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి ఎవరైనా నకిలీ, విడి విత్తనాలు అమ్మితే ఫిర్యాదు చేయాలి. నకిలీ విత్తనాలకు తావివ్వకుండా ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. రైతులు కూడా సహకరించాలి.

– అడప కవిత, ఏఓ

సామాజిక తనిఖీ బృందాలకు సహకరించాలి

- ఎంపీడీఓ బాబు


మాట్లాడుతున్న గుండె బాబు

కమలాపూర్ : సామాజిక తనిఖీ బృందాలకు అవసరమైన రికార్డులు సకాలంలో అందించి సహకరించాలని ఎంపీడీఓ గుండె బాబు పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందిని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ గుండె బాబు అధ్యక్షతన ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ సమన్వయ సమావేశం సోమవారం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. మండలంలో జరిగే 15వ విడత సామాజిక తనిఖీ ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాలని తనిఖీ బృందాన్ని, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందిని కోరారు. అనంతరం ఎస్ఆర్పీ చెన్నకేశవులు మాట్లాడుతూ.. మండలంలో 1-4-2023 నుంచి 31-3-2024 వరకు జరిగిన 335 పనులకు రూ.4.8 కోట్లు ఖర్చు చేశారని, ఈ పనులకు సంబంధించి మంగళవారం నుంచి డీఆర్పీల సహాయంతో బృందాలుగా ఏర్పడి వివిధ గ్రామపంచాయతీల్లో సామాజిక తనిఖీ బృందాలు తనిఖీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సామాజిక తనిఖీ బృదాలకు ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీఓ రమేష్, ఈసీ కార్తీక్, డీఆర్పీలు తదితరులు పాల్గొన్నారు.

యూనిఫాంలు త్వరగా అందించాలి


యూనిఫాంను పరిశీలిస్తున్న రాధ

శాయంపేట : ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభం అయ్యేలోగా పిల్లలకు యూనిఫాంలను అందించాలని జిల్లా విద్యాశాఖ కార్యాలయం సీఎంఓ కమ్యూనిటీ సమగ్ర శిక్షణ కేంద్రం మొబలైషన్ అధికారి రాధ కుట్టుశిక్షణ కేంద్రం నిర్వాహకులకు సూచించారు. మండలంలోని పత్తిపాక గ్రామంలో గల స్వయం సహాయక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టుశిక్షణ కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. సభ్యులకు అందించిన యూనిఫాం క్లాత్‌ను త్వరగా కుట్టి ఇవ్వాలని సూచించారు. నాణ్యత ప్రమాణాలతో దుస్తులను కుట్టాలని, ఈనెల 5లోగా అందజేయాలని ఆదేశించారు. కుట్టు పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీసీ విజయ్‌కుమార్ ఉన్నారు.

పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలి

- ఎంపీపీ జక్కుల అనిత


మాట్లాడుతున్న ఎంపీపీ అనిత

ఎల్కతుర్తి: పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఎంపీపీ జక్కుల అనిత అన్నారు. సోమవారం భీమదేవరపల్లి మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జులై 3 నాటికి ఎంపీటీసీల పదవీ కాలం ముగియనున్న నేపథ్యంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను తక్షణమే పూర్తయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. హనుమకొండ జిల్లాలో బెస్టు అవైలేబుల్ పాఠశాలల్లో 3,5,8 తరగతుల్లో ప్రవేశాలకు ఈనెల 6 చివరి తేదీ అని, వసతిగృహ అధికారి రాజారామ్ తెలిపారు. ఈ గడువులోగా విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. అలాగే వివిధ పాఠశాలల్లో 20సీట్లు ఖాళీగా ఉన్నాయని, విద్యార్థులు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్‌కార్డు, బోనోఫైడ్ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. భీమదేవరపల్లి మండల పరిధిలోని కొత్తకొండ, ముల్కనూరు సబ్‌స్టేషన్ ద్వారా విద్యుత్ వినియోగించుకుంటున్న 7,112 మంది వినియోగదారులకు గృహ జ్యోతి ద్వారా రూ.24లక్షలు లబ్ధి చేకూరుతోందని ఏఈలు లక్ష్మణ్‌నాయక్, శిరీష్ తెలిపారు. అర్హులైన వారు ఎన్నికల కోడ్ ముగిసిన అనంతరం దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ వీరేశం, ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బీరన్న బోనాల జాతర

కమలాపూర్ : మండలంలోని ఉప్పల్‌లో బీరన్న బోనాలల జాతర సోమవారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కురుమ, యాదవ మహిళలు బోనాలెత్తుకొని డప్పుచప్పుళ్ల నడుమ శోభాయాత్ర నిర్వహించి బీరన్న ఆలయానికి తరలివెళ్లారు. నైవేద్యం సమర్పించి మొక్కలు చెల్లించుకున్నారు. అనంతరం బీరన్నకామరాతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. బోనాల వేడుక, కల్యాణ మహోత్సవానికి మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కురుమ, యాదవ సంఘం నాయకులు, కులపెద్దలు పాల్గొన్నారు.


బోనాలతో వెళ్తున్న మహిళలు

వేణుగోపాలస్వామి కల్యాణం

మండలంలోని కన్నూరులో గల వేణుగోపాలస్వామి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి కల్యాణం సోమవారం కనులపండువగా జరిగింది. ఈ కల్యాణ మహోత్సవంలో పీఏసీఎస్ డైరెక్టర్ తక్కళ్లపల్లి సత్యనారాయణరావు, కాంగ్రెస్ నాయకుడు పుల్లూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో తదితరులు పాల్గొన్నారు.

హరీశ్‌రావు జన్మదిన వేడుకలు

హసన్‌పర్తి: మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు జన్మదిన వేడుకలు భీమారంలో బీఆర్ఎస్ నాయకులు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బర్త్‌డే కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌తో పాటు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

‘మాస్టర్ మైండ్స్’పై చర్యలు తీసుకోవాలి

నర్సంపేట : పట్టణంలోని మాంటిస్సోరి స్కూల్ యాజమాన్యం ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తూ మాస్టర్ మైండ్స్ స్కూల్ పేరుతో మండలవ్యాప్తంగా ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేస్తూ మోసపూరిత ప్రచారం చేస్తోందని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు అల్వాల నరేశ్, డీవైఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు గడ్డమీది బాలకృష్ణ, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు చింతం సిద్ధు తెలిపారు. పట్టణంలో మాస్టర్ మైండ్స్ పేరుతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఎదుట విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన తెలిపారు. పాఠశాల యాజమాన్య తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. అనంతరం బొట్ల నరేశ్, అల్వాల నరేశ్, బాలకృష్ణ, సిద్ధు మాట్లాడారు. మాంటిస్సోరి స్కూల్ పేరుతో పాఠశాల నిర్వహించాల్సి ఉండగా అందుకు భిన్నంగా మాస్టర్ మైండ్స్ స్కూల్ పేరుతో గ్రామాల్లో ప్రచారం చేస్తున్నట్టు తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి భారీగా వసూలు చేస్తున్నారని చెప్పారు. సదరు స్కూల్ యాజమాన్య తప్పుడు విధానాలపై సంబంధిత విద్యాశాఖ అధికారికి వారం రోజుల క్రితం ఫిర్యాదు చేసినా స్పందించలేదని ధ్వజమెత్తారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.


నినాదాలు చేస్తున్న నాయకులు

క్రీడలతో శారీరక, మానసిక వికాసం

గీసుకొండ : క్రీడలతో విద్యార్థుల్లో శారీరక, మానసిక వికాసం కలుగుతుందని సీఐ ఎల్.పవన్‌కుమార్ తెలిపారు. మండల కేంద్రంలో నెల రోజుల పాటు నిర్వహించిన వేసవి ఖోఖో శిక్షణ శిబిరం సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమానికి ఆయన అతిథిగా హాజరై క్రీడాకారులకు మెమొంటోలు అందజేసి అభినందించారు. అనంతరం సీఐ మాట్లాడారు. విద్యార్థి దశలోనే క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. చదువులకే పరిమితం కాకుండా ఆటపాటల్లోనూ రాణిస్తే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని చెప్పారు. క్రీడలపై మక్కువ పెంచుకోవాలని సూచించారు. ఎస్సై వెంకన్న, ఉపాధ్యాయుడు కర్ణకంటి రామ్మూర్తి, తదితరులు పాల్గొన్నారు.


క్రీడాకారులకు మెమొంటోలు అందజేస్తున్న సీఐ పవన్‌కుమార్ తదితరులు

పుస్తకాల విక్రయాలను అడ్డుకుంటాం

నర్సంపేట : ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో పాఠ్యపుస్తకాల విక్రయాలను అడ్డుకుంటామని ఏఐఎస్‌బీ డివిజన్ కన్వీనర్ బి.పూర్ణ స్పష్టం చేశారు. పట్టణంలోని సిద్దార్థ కళాశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నర్సంపేట డివిజన్‌లోని పలు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు, డ్రెస్సులు, షూ, సాక్స్, టై, బెల్ట్‌లు అధిక ధరలకు విక్రయిస్తూ తల్లిదండ్రుల నుంచి మోసపూరితంగా డబ్బు దండుకుంటూ సొమ్ము చేసుకుంటున్నాయని ఆరోపించారు. ఇకనైనా ప్రభుత్వం, విద్యాశాఖ జిల్లాస్థాయి అధికారులు స్పందించి స్కూళ్లలో యూనిఫారాలు, ఇతరత్రా పేరుతో వ్యాపారాలు నిర్వహించడాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు తప్పవని ఈ సందర్భంగా హెచ్చరించారు.



డ్రెయినేజీకి మోక్షమెప్పుడో..?

- వీధుల్లో ప్రవహిస్తున్న మురుగునీరు
- వెదజల్లుతున్న దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు, కాంట్రాక్టర్లు

వేలేరు : గత ప్రభుత్వ హయాంలో ధర్మసాగర్ మండలంలోని సాయిపేట క్రాస్ రోడ్డు నుంచి వేలేరు పోలీస్ స్టేషన్ వరకు రూ.35 కోట్లతో డబుల్‌రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేశారు. కానీ డ్రెయినేజీ సదుపాయం కల్పించకపోవడంతో మురుగునీరు రోడ్డుపైనే నిలిచిపోతోంది. ముఖ్యంగా మండలంలోని మల్లికుదుర్ల, సోడాషపల్లి మండల కేంద్రాల్లో డ్రెయినేజీ సమస్య తీవ్రంగా ఉంది. మురుగునీరు వీధుల్లోకి ప్రవహించి వీధులు మొత్తం కంపు కొడుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షపు నీరు రోజుల తరబడి నిల్వ ఉంటున్నాయి. దీంతో దోమలు, పందులు స్వైరవిహారం చేస్తున్నాయి. వర్షాకాలం ప్రారంభమయ్యే నేపథ్యంలో డెంగీ, మలేరియా, సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధితశాఖ అధికారులు స్పందించి ఇప్పటికైనా మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లో సైడ్ డ్రెయినేజీలు నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. వర్షకాలం ప్రారంభం అయిన నేపథ్యంలో డ్రెయినేజీ సమస్య తప్పేలా లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని, వెంటనే డ్రెయినేజీ సమస్యను పరిష్కరించాలని వారు కోరుతున్నారు.


మండల కేంద్రంలో పేరుకుపోయిన మురుగునీరు


రహదారికిరువైపులా నిలిచిన వర్షపు నీరు


కాలనీల్లో నిలిచిన మురుగునీరు

డ్రెయినేజీలు నిర్మించాలి



మండల కేంద్రంలో డ్రెయినేజీ సదుపాయం లేకపోవడంతో వర్షపు నీళ్లు ఇళ్లలోకి వస్తున్నాయి. మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు, ఈగలు, పందులకు ఆవాసాలుగా మారుతున్నాయి. వచ్చేది వర్షాకాలం కాబట్టి నీరు నిలిచి సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది. కాబట్టి సంబంధిత శాఖ అధికారులు వెంటనే డ్రెయినేజీని నిర్మించాలని.

- రాజబాబు, వేలేరు

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆవిర్భావ వేడుకలు

దామెర : తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ముగింపు వేడుకలు సోమవారం మండల కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు గుండు రాము పార్టీ జెండాను ఆవిష్కరించారు. ప్రధానకార్యదర్శి కృష్ణమూర్తి, వైస్ఎంపీపీ జాకీర్‌అలీ, నాయకులు శ్రీధర్‌రెడ్డి, రమేశ్, కిశోర్, వీరస్వామి పాల్గొన్నారు.


పార్టీ జెండా ఆవిష్కరిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి

పర్వతగిరి : విద్యుదాఘాతంతో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని దేవీలాల్ తండాలో సోమవారం చోటు చేసుకుంది. తండాకు చెందిన రైతు ధరావత్ వెంకన్నకు చెందిన ఎద్దు మేత మేస్తుండగా పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్ వద్ద విద్యుత్ వైర్లు తగలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ.80 వేలు ఉంటుందని రైతు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు కోరాడు.


మృతి చెందిన ఎద్దు వద్ద రోధిస్తున్న రైతు వెంకన్న